క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ప్రచారం

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ, ఎరుకలచెరువు, ఆగవేళి, మల్లాపురం, పోతుగల్లు, సంగాల, చిట్యాల, ఆలంకొండ, కటారుకొండ గ్రామాల్లో గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడు, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని వారు కోరారు.

ఐరన్‌బండలో ఆరోగ్య సురక్షక్యాంపు

దేవనకొండ: మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో శుక్రవారం తెర్నెకల్ వైద్యాధికారి అరుణజ్యోతి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ రూబి, డాక్టర్ రాహుల్, కంటి వైద్యనిపుణులు, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి పాల్గొని రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే ఆరోగ్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రంగస్వామి, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి


కేంద్రబలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

కృష్ణగిరి: ఈనెల 13న ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం వారు కృష్ణగిరి మండల పరిధిలోని కోయిలకొండ, చిట్యాల, కటారుకొండ, ఆలంకొండ, బోయబొంతిరాళ్ల గ్రామాల కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎవరు ఏ చిన్న గొడవలకు పాల్పడినా కఠిన చర్యలకు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

నీటి సమస్య లేకుండా చూడండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంథోనీ

హాలహర్వి: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నగేష్, ఎంపీడీఓ ఆంథోనీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే ప్రత్యామ్నాయం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్నను ఆదేశించారు. ఉపాధిహామీ పథకంలో కూలీలందరూ పాల్గొనేలా చూడాలని, గిట్టుబాటు వేతనం అందించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థి ప్రచారం

హొళగుంద: మండలంలోని సుళువాయి, మూగుమానుగుంది, సమ్మతగేరి, కోగిలతోట, ముద్దటమాగి తదితర గ్రామాల్లో శుక్రవారం ఇండియా కూటమి అభ్యర్థి అరకట్ల నవీన్‌కిశోర్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పెద్యాట మారెప్ప, వెంకటేశ్వర్లు ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు నాగరాజు, రంగన్న, రామాంజనేయులు, కృష్ణ, సలాం తదితరులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓటేయాలని కోరారు.

➡ వెల్దుర్తి(కృష్ణగిరి): ఇండియా కూటమి పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ రామచంద్రయ్య, కర్నూలు ఎంపీ అభ్యర్థి కాంగ్రెస్ రాంపుల్లయ్య యాదవ్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు శుక్రవారం వెల్దుర్తి మండలంలోని కలుగొట్ల, సిద్ధినగట్టు, లింగాలపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, రాజు, చిన్నమాదులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో మాక్ పోలింగ్

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రక్రియలో భాగంగా నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ పర్యవేక్షించారు. 5 శాతం ఈవీఎంలలో 1000 ఓట్లు వేసి పారదర్శకంగా నిర్ధారించినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బందికి అవగాహన పెంచేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. శనివారం కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఈవీఎంలపై కమిషనింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అభివృద్ధి చేస్తా.. అవకాశమివ్వండి


వలగొండలో మాట్లాడుతున్న బుసినె విరూపాక్షి


పుటకలమర్రిలో ప్రజలకు అభివాదం చేస్తున్న బుసినె విరూపాక్షి

- వీరభద్రగౌడ్‌కు ఓటు వేస్తే గుమ్మనూరుకు వేసినట్లే
- వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినె విరూపాక్షి

ఆస్పరి: ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని చిగిళి, వలగొండ, పుటకలమర్రి, ముత్తుకూరు, బిల్లేకల్లు, అట్టికల్లు గ్రామాల్లో సర్పంచులు జయమ్మ, విశాలాక్షి, తోయజాక్షప్ప, బోయ శ్రీనుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగనన్న ప్రకటించిన మేనిఫెస్టోను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. చిగిళిలో ఏర్పాటు చేసిన గిరకబండి పోటీలను ప్రారంభించారు. చంద్రబాబు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. గుమ్మనూరు జయరాం నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, ప్రజల సొమ్మును దోచుకుని పార్టీ మారాడని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్‌కు ఓటేస్తే జయరాంకు వేసినట్లేనన్నారు. జయరాం మరోసారి ఆలూరు వైపు చూడకుండా ఉండాలంటే ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈనెల 13న రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఆలూరు ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, కురువ సంఘం నాయకురాలు శశికళ, ఎంపీటీసీ సభ్యులు రాధాక్రిష్ణ, మల్లికార్జున, సుంకులమ్మ, నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, సుంకుర రామాంజనేయులు, దత్తాత్రేయరెడ్డి, రాజన్న, కేశవరెడ్డి, పురుషోత్తమరెడ్డి, శివారెడ్డి, దుమ్మా నరసింహులు, లక్ష్మీనారాయణ, శివానంద, వెంకన్న, వేణుగోపాల్, మనోహర్‌రెడ్డి, చంద్ర, రాజేంద్ర, వెంకటేష్, ప్రకాష్, పాండు, వెంకటరెడ్డి, చిన్నాయప్ప, రాజశేఖర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


కోయనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలూరు రూరల్: స్థానిక కోయనగర్, ఎల్లార్తి రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షి తనయుడు చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో ప్రతులను అందజేసి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో ఎంపీటీసీ మోతి ఎల్లమ్మ, కో–ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా, నాయకులు భాస్కర్, కిషోర్, గజ్జలప్ప, శేఖర్, వరుణ్, బాబు, గౌడప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి మండలంలో..


నేమకల్లులో మాట్లాడుతున్న విరూపాక్షి

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు, సంగాల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య, కురువ సంఘం నాయకురాలు శశికళ, నేమకల్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, నాయకులు సత్తి రెడ్డి, నాథ్, లాల్‌స్వామి, లింగన్న, గురుదాస్, సుంకన్న, భీమలింగ పాలొన్నారు.


శ్రీరంగాపురంలో శ్రీదేవి రోడ్‌షోకు హాజరైన గ్రామస్తులు

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి



గుంటుపల్లెలో మాట్లాడుతున్న శ్రీదేవి. పక్కన పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ

వెల్దుర్తి(కృష్ణగిరి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె వెల్దుర్తి మండలం గుంటుపల్లె, శ్రీరంగాపురం, బింగిదొడ్డి, కలుగొట్ల, పుల్లగుమ్మి, రామళ్లకోట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. శ్రీరంగాపురం, లక్ష్మంపల్లె, గుంటుపల్లె గ్రామాలకు బీటీ రోడ్లు వేసి ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు.

➡ తమ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను తెలుపుతూ, ఆయా గ్రామ నాయకులు కోరిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను తెలుసుకుని, మరోసారి గెలిచిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మే 13న రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే సీఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఓటమి ముందే గ్రహించిన టీడీపీ నాయకులు ఇకపై చేసే జిమ్మిక్కులపై జాగ్రత్త వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు దివంగత చెరుకులపాడు నారాయణ రెడ్డి హయాం నుంచి తమ కుటుంబం ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, వెంకట్‌నాయుడు, నాయకులు జనార్దనరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాలకృష్ణ, వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మద్దిలేటి, నాగార్జున రెడ్డి, అచ్యుతానందరెడ్డి, శ్రీను, కర్నూలు శ్వేతారెడ్డి, మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, మాలిక్‌బాషా, శ్రీను పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో కంగాటి శ్రీదేవి

వైఎస్సార్‌సీపీలో చేరిక

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు 10 మంది శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో ప్రచారం సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మద్దిలేటి, శివన్నల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన తలారి పెద్ద భూషన్న, తలారి బాలు, చాకలి ప్రతాప్, గొంది బలరాముడు, తుపాకుల గోపాల్, కురువ వెంకటేశ్వర్లు, చింతమాను రాముడు, కోటకొండ బజారు, పింజరి మాబులాల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పథకాలు, అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన కృషికి తాము రాబోవు ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేను గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, కర్నూలు కార్పొరేటర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.


తిప్పన్న తాత ఊరేగింపులో భక్తులు


అశేష జనవాహిని మధ్య రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

ఆస్పరి: మండలంలోని చిగిళిలో శుక్రవారం అశేష జనవాహిని మధ్య శ్రీగిరి కట్టెల తిప్పన్న తాత రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో తిప్పన్న తాతకు గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. నందికోలు సేవ, మంగళవాయిద్యాలతో తాత ఉత్సవ విగ్రహన్ని ఊరేగించారు. రథానికి పూజలు చేసిన అనంతరం రథాన్ని గ్రామం చివర ఉన్న ఎదురు బసవన్న ఆలయం వరకు లాగారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

రేపు కేంద్ర మంత్రి రాక

ఆదోని అర్బన్: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదోనికి వస్తున్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. ప్రచార రథం ద్వారా రోడ్ షో నిర్వహిస్తారు. ఆర్ట్స్ కళాశాల నుంచి తిక్కస్వామి దర్గా మీదుగా భీమాస్ సర్కిల్ నుంచి కోట్ల కూడలికి చేరుకుని బహిరంగ సభ నిర్వహిస్తారు. అక్కడి నుంచి పాత బస్టాండు మీదుగా ఏరియా ఆస్పత్రి వరకు రోడ్ షో నిర్వహిస్తారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి తరఫున ప్రచారం చేపట్టనున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రాంతీయ ప్రభుత్వ సర్వజన వైద్యశాల, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్థానికంగా విద్యుత్ సరఫరా సమయంలో ట్రిప్ కావడంతో ఈ మూడు ప్రాంతాల్లో మధ్యాహ్నం గంట పాటు విద్యుత్ నిలిచిపోయింది. ఈ కారణంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యకలాపాలు, కంటి ఆసుపత్రిలో రోగులకు కంటి పరీక్షలు, వైద్యపరీక్షలు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య పరీక్షలు, చికిత్సలు నిలిచిపోయాయి. పలు వార్డుల్లో ఫ్యాన్లు తిరగక రోగులు ఇబ్బంది పడ్డారు. అయితే అత్యవసర విభాగాల్లో మాత్రం జనరేటర్ల సహాయంతో అధికారులు విద్యుత్‌ను సరఫరా చేయడంతో అక్కడ ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం


పగిడిరాయిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు


బొమ్మనపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


పెరవలిలో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: పత్తికొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవిని గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు తమతమ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి, పగిడిరాయిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల, సచివాలయ అధ్యక్షులు నాగేష్, హనుమంతు, ప్రభాకరరెడ్డి, బసిరెడ్డి, మధుసూదనరెడ్డి, రమ్య, సంధ్య, నరసింహారెడ్డి, లాలిరెడ్డి, జనార్ధన, హనుమంతు, రామాంజిని పాల్గొన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవి, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. పెరవలి గ్రామంలో కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులు డాక్టర్ తేజస్విణి, సర్పంచ్ మల్లికార్జున, నాయకులు రామలింగారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బొమ్మనపల్లి వెంకటేశులు, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, మాజీ ఎంపీపీ మల్లికార్జున, ఎంపీటీసీలు రామకృష్ణ, నాయకులు ఆంజనేయులు, కృష్ణ, వెంకటేశులు, నాగేష్, అశోక్‌రెడ్డి, బాలు, తాలూరి వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లింగరాజు, రామాంజులు, గోపాల్, మోహన్‌రెడ్డి, తిమ్మయ్య పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అవస్థలు

పింఛన్‌దారుల కష్టాలు మూడవరోజు కొనసాగాయి. 1వ తేదీ బ్యాంకులు బంద్ కాగా, రెండవ రోజు నుంచి వారికి చుక్కలు కనబడుతున్నాయి. కొందరికి బ్యాంకులలో, బీసీ పాయింట్లలో అందుతున్నా మరి కొందరికి అకౌంట్ ఫ్రీజింగ్‌లో ఉండి తిరిగి ఆ అకౌంట్‌ని వర్కింగ్ కండీషన్‌లోకి తెచ్చుకునేందుకు బ్యాంకు వారి పత్రాలు నింపేందుకు, అవసరమైన పత్రాలు సమర్పించేందుకు జిరాక్స్ సెంటర్ల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తమ గ్రామాల నుంచి సుదూర ప్రాంతాలకు తిరగాల్సి వచ్చింది. అసలే ఎండ ఆపై పైబడిన వయసుతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

–కృష్ణగిరి/మద్దికెర/ఆలూరు/రూరల్/దేవనకొండ


వెల్దుర్తి బ్యాంకులో పింఛన్‌దారుల రద్దీ


పింఛన్ కోసం మద్దికెరలో బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఇంటికే వచ్చి ఇచ్చేవారు



వలంటీర్ నెలనెలా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. చంద్రబాబు వద్దన్నాడంట. ఆయనకు ఏంపోయే కాలమో. మా ఊరి నుంచి ఇక్కడికి కిలోమీటర్లు. (హత్తిబెళగల్– ఆలూరు). ఇక్కడికి వచ్చి బ్యాంకులో వరుసలో నిలబడి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి. ఇన్ని బాధలు పెట్టి చంద్రబాబు ఏం కూడగట్టుకుంటాడో.

– శంకరమ్మ హత్తిబెళగళ్ గ్రామ వృద్ధురాలు

మా ఉసురు తగులుతుంది



నాలుగేళ్లుగా వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. రెండు నెలల నుంచి ఇవ్వడం లేదు. చంద్రబాబు మాలాంటి వృద్ధులపైనా ప్రతాపం చూపేది?. రాజకీయం ఉంటే మీరుమీరు చూసుకోండి. ఇట్లానే ఇబ్బందులు పెడితే మా ముసలోళ్ల ఉసురు తగులుతుంది.

– కాశమ్మ, పెరవలి, మద్దికెర మండలం

గత పరిస్థితులే మళ్లీ వచ్చాయి



టీడీపీ ప్రభుత్వం పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి సాయంత్రం వరకు పడిగాపులు కాసే వాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక కష్టాలు తొలిగిపోయాయి. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. చంద్రబాబు కుట్రలకు మాకు పాతకష్టాలు వచ్చిపడ్డాయి. రోజంతా బ్యాంకు వద్దనే ఉండాల్సి వచ్చింది. నాతో పాటు చాలా మంది ఉన్నారు. ఉదయం నుంచి నిరీక్షించి నగదు తీసుకున్నాను.

– చిట్టెమ్మ, ఆలూరు

నా పింఛన్ ఏమయిందో



సచివాలయానకి వెళ్తే బ్యాంకుకు వెళ్లమన్నారు. ఇక్కడేమో అకౌంట్‌లో పింఛన్ పడలేదంటున్నారు. నా పింఛన్ ఏమయిందో తెలియడం లేదు. 20 కి.మీల దూరం(సర్పరాజాపురం – వెల్దుర్తి) నుంచి వచ్చాను. పింఛన్ చేతికందలేదు. రేపు, ఎల్లుండి కూడా ఇక్కడికి వచ్చి పింఛన్ పడిందో లేదో కనుక్కోవాలి. నెలనెల వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవాడు. ఎండలో ఇంకెన్ని రోజులు తిరగాలో.

– పైగేరి చిట్టెమ్మ, వితంతు పింఛన్‌దారు, సర్పరాజాపురం

కట్టె సాయంతో వచ్చాను



పింఛన్ బ్యాంకు ఖాతాలో పడిందో లేదోనని తెలుసుకునేందుకు కట్టె సాయంతో నడుచుకుంటూ ఇక్కడికి (ఏపీజీబీ) వచ్చాను. బ్యాంకులో రైతులు రుణాలను రెన్యూవల్ చేసుకుంటుండడంతో మేం నగదు తీసుకునేందుకు చాలా సమయం పడుతోంది. గతంలో వలంటీర్ల ద్వారా పింఛన్ ఇంటి వద్దే అందేది. పింఛన్ కోసం ఇంత ఇబ్బందులు పడతానని అనుకోలేదు. మా ఉసురు చంద్రబాబునాయుడికి కొట్టుకుంటుంది.

– రంగమ్మ, వృద్ధురాలు, దేవనకొండ

పింఛన్‌దారుల కష్టాలకు చంద్రబాబే కారణం

చిప్పగిరి: పింఛన్‌దారుల కష్టాలకు చంద్రబాబే కారణమని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గత నెలలో లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారన్నారు. చంద్రబాబు కుట్రతో ఈనెల పింఛన్ తీసుకునేందుకు పింఛన్‌దారులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కష్టాలకు కారణమైన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య, నాయకులు లాల్‌స్వామి, లింగన్న పాల్గొన్నారు.

హిందూ సనాతన ధర్మాన్ని నేర్పించాలి

కర్నూలు కల్చరల్: హిందూ సనాతన ధర్మాన్ని నేటి పిల్లలకు నేర్పడం అత్యవసరమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ అన్నారు. శుక్రవారం ఆదిత్య విద్యాలయంలో వీహెచ్‌పీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆచార వ్యవహారాలపై అవగాహన కలిగించాలన్నారు. ఉమ్మడి కుటుంబాలతో అనేక ప్రయోజనాలు ఉండేవన్నారు. ప్రస్తుతం చిన్న కుటుంబాలు కావడంతో పిల్లలకు నైతిక విలువలు, సంప్రదాయాలు, సంస్కారం నేర్పేవారు కరువయ్యాయన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవయ్య, పాఠశాల అధినేత వరలక్ష్మి, శిబిరం నిర్వాహకురాలు మాతృశక్తి నగర కన్వీనర్ పావని, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్ పాల్గొన్నారు.